క్లుప్తంగా

నేడు పుస్తకావిష్కరణ

సీటీఆర్‌ఐ: ఆచార్య బేతవోలు రామబ్రహ్మం రచించిన క్రొత్త గోదావరి పుస్తకావిష్కరణ కార్యక్రమం వై.జంక్షన్‌లోని ఆనం రోటరీహాల్లో శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నామని సాహితీ గౌతమీ వ్యవస్థాపకుడు, విశ్రాంత ఓఎన్‌జీసీ జీఎం పి.విజయ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రపతి పురస్కారగ్రహీత, మహోమహోపాధ్యాయులు డాక్టర్ సముద్రాల రంగరామానుజాచార్యులు, ఆచార్యులు డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, సాహితీ గౌతమి కార్యదర్శి దినవహి బాపిరాజు పాల్గొంటారన్నారు.

బీసీ మహిళా సంఘం కన్వీనర్‌గా డాక్టర్ పద్మలత



రాజమహేంద్రవరం సిటీ: ఆంధ్ర ప్రదేశ్ బీసీ మహిళా సంక్షేమ సంఘం కన్వీనర్‌గా రాజమహేంద్రవరానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ డాక్టర్ అనసూరి పద్మలత నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కన్వీనర్‌గా నియమించడం ఆనందంగా ఉందన్నారు. కాగా.. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.

ఉచితంగా తాగునీరు

కడియం: ఆర్‌వో ప్లాంటు ద్వారా ప్రజలకు ఉచితంగా తాగునీరు అందించనున్నట్లు బుర్రిలంక పీఎస్‌ఎం కన్వెన్షన్ అధినేత పాటంశెట్టి శ్రీనివాస చక్రవర్తి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన తల్లి లక్ష్మి పేరిట పీఎస్‌ఎం కన్వెన్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌ను శనివారం ప్రజాప్రతినిధులు, ప్రముఖుల చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైద్యశిబిరం

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో రాజమహేంద్రవరానికి చెందిన డెల్టా హాస్పటల్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు ఎం.ధనసాయిరెడ్డి, కె.సౌమ్య, సత్యం రమేష్‌బాబు.. 114 మందికి వైద్య సేవలు అందించారు. వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, హాస్పిటల్ జీఎం క్రాంతి కుమార్, ఏఎం శివప్రసాద్ పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే మోదీ ధ్యేయం



మాట్లాడుతున్న పురందేశ్వరి

మధురపూడి: అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం పాలన సాగుతోందని, మరోసారి బీజేపీకి, మోదీకి అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. కోరుకొండ మండలం మధురపూడిలో శుక్రవారం జరిగిన బీజేపీ వాల్ పెయింటింగ్ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మైనార్టీ వర్గాల్లోని మహిళలకు హక్కులు కల్పించిన ఏకైక ప్రభుత్వంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిలిచిందన్నారు. ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ వర్గాల సంక్షేమం కోసం ప్రత్యేక పథకాల ద్వారా ముందుకు సాగుతోందన్నారు. ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించి ప్రత్యేకతను చాటుకుందన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన కూడళ్లలో పెయింటింగ్ చేశారు. ప్రతి పల్లెకు బీజేపీ సంక్షేమ పాలనను చేరువ చేయాలన్న లక్ష్యంతో వాల్ పెయింటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అఖిల భారత కార్యదర్శి వై.సత్యకుమార్ యాదవ్, పార్టీ రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ ఏపీఆర్ చౌదరి, జిల్లా అధ్యక్షుడు పరిమి రాధాకృష్ణ, పార్టీ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి, అడబాల గణపతి పాల్గొన్నారు.





సందడే సందడి

- రాజమహేంద్రవరంలో హ్యాపీస్ట్రీట్
- ఆదివారం ప్రారంభం
- పరమహంస యోగానందమార్గ్‌లో ఏర్పాట్లు

రాజమహేంద్రవరం సిటీ: జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంలో సరికొత్త అందాలకు నెలవు కానుంది. జేఎన్ రోడ్డులోని ఏకేసీ కాలేజ్ పక్క వీధి పరమహంస యోగానంద మార్గ్‌ను హ్యాపీస్ట్రీట్‌గా నగర పాలక సంస్థ సిద్ధం చేసింది. నగర ప్రజలు ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి ఆదివారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ హ్యాపీస్ట్రీట్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సుమారు రూ.80 లక్షల వ్యయంతో నగర పాలక సంస్థ నిధులతో అక్కడ పలు నిర్మాణాలు చేపట్టారు. ఈ వేడుక ఈ ఆదివారం ప్రారంభం కానుంది.

ప్రత్యేక ఏర్పాట్లు

వాకర్స్ రోడ్డుగా పేరు పొందిన పరమహంస యోగానంద మార్గ్ నూతనంగా హ్యాపీస్ట్రీట్‌గా రూపాంతరం చెందనుంది. ప్రతి ఆదివారం కుటుంబ సభ్యులతో కలసి వచ్చి సేదదీరాలని నగర పాలకసంస్థ ప్రజలకు ఆహ్వానం పలుకుతోంది. పిల్లలకు, పెద్దలకు వేర్వేరుగా ఆటపాటలు, సంగీతంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించనున్నారు. ఇందుకోసం నగర పాలకసంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జుంబో డ్యాన్స్, యోగా లైవ్ స్టేజ్, ఔట్ డోర్ బ్యాడ్మింటన్, ఔట్ డోర్ టేబుల్ టెన్నిస్ వంటివి నిర్వహించనున్నారు. బాలల కోసం ప్రత్యేకంగా బోర్డ్–లైఫ్ సైజ్ క్రీడలు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

ఉత్పత్తుల ప్రచారానికి అవకాశం

పరమహంస యోగానంద మార్గ్‌లో డివైడర్‌కు ఒక వైపు రోడ్డును హ్యాపీస్ట్రీట్ నిర్వహించే ప్రతి ఆదివారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ మూసివేస్తారు. ఒకవైపు మాత్రమే వాహనాల రాకపోకలకు అనుమతి ఇస్తారు. 9 గంటల తరువాత రెండు మార్గాలలో రాకపోకలు కొనసాగుతాయి. ఇప్పటి వరకు దేశంలో మహానగరాలకే పరిమితమైన హ్యాపీస్ట్రీట్ ఇప్పుడు రాజమహేంద్రవరంలో ప్రారంభం కానుంది. ఆదివారం మొదలుకానున్న ఈ వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ఆహ్లాదకరంగా గడపాలని ప్రజలకు కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్ సూచించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో నగరంలోని ఆసక్తి ఉన్న సంస్థలు తమ ఉత్పత్తుల ప్రచారానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ comm.rmc@gmail.com ద్వారా అవకాశం కల్పించామన్నారు.



హ్యాపీస్ట్రీట్ కార్యక్రమం కోసం చేసిన ఏర్పాట్లు

23న గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు రాతపరీక్షలు

రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో ఐదో తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆదివారం రాతపరీక్ష నిర్వహించనున్నట్లు బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వాణికుమారి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. ఐదోతరగతికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ఇంటర్మీడియెట్‌కు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ఏపీ.జీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో ఐదోతరగతి విద్యార్థులు, అలాగే ఏపీ.జీపీసీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్టీఈఆర్ వెబ్‌సైట్‌లో ఇంటర్మీడియెట్ విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని వాణికుమారి సూచించారు.

ముగిసిన సువార్త సభలు

కడియం: మండలంలోని వేమగిరిలో చెల్లుబోయిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మూడు రోజులు నిర్వహించిన సువార్త సభలు శుక్రవారం ముగిశాయి. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో పెద్దసంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ నాయకులు వెలుగుబంటి రఘురామ్, గుత్తుల ముత్యం, జోగి చక్రవర్తి, గుత్తుల శేషగిరి, కాండ్రేగుల సత్తిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన శ్రీనివాస్ చేస్తున్న సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ఆయనను ఘనంగా సత్కరించారు.

జగన్ పాలనలో పారదర్శకంగా పథకాలు



కడియంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్



ధవళేశ్వరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న చందన నాగేశ్వర్

కడియం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రెండోరోజు కడియం సచివాలయం – 4 పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరు, ప్రభుత్వ పనితీరును తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత వలంటీరు, అధికారులకు నేరుగా తెలియజేసి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, మురుగు కాలువలు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై పరిశీలించి, ఆయా శాఖల సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, జేసీఎస్ చైర్మన్ తాడాల చక్రవర్తి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు దొడ్డా బుజ్జి, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, పార్టీ నాయకులు ఊటుకూరి శైలజ, సాకా పట్టాభి, సాపిరెడ్డి కామేష్, ఆర్ఎస్ఎన్ మూర్తి, బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

ధవళేశ్వరం: ధవళేశ్వరం మసీదులో శుక్రవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ విందులో చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ముస్లింలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నూరుశాతం రేషన్ పంపిణీ చేయాలి

- ఎంపీ భరత్‌రామ్
- డీలర్లు, ఎండీయూ వాహనం ఆపరేటర్లతో సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీ భరత్ రామ్, జేసీ తేజ్ భరత్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వార్డులకు వెళ్లినప్పుడు చాలామంది ప్రజలు తమకు రేషన్ అందడం లేదని చెబుతున్నారని, ఇది చాలా బాధాకరమని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. నగరంలోని శ్రీనివాస రౌతు తాతాలు కల్యాణ మండపంలో రేషన్ డీలర్లకు, ఎండీయూ వాహన ఆపరేటర్లకు శుక్రవారం జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే రేషన్ బియ్యం, పంచదార, పప్పు చాలామంది సామాన్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మానవతా దృక్పథంతో లబ్ధిదారులందరికీ రేషన్ నూరుశాతం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిత్యావసర వస్తువుల సరఫరాలో ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు అందినా సహించేది లేదని స్పష్టం చేశారు. కొన్ని వార్డులలో ఎండీయూ ఆపరేటర్లపై 6ఏ కేసులు ఉండటం వల్ల, ఆయా వార్డులను పక్క ఎండీయూ వాహన ఆపరేటర్లకు అప్పగించారని, వాటివల్ల కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వాటినన్నింటినీ సరిచేసి నూరుశాతం లబ్ధిదారులకు రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలని జేసీకి సూచించారు. సమావేశంలో డీఎస్‌ఓ పీ ప్రసాదరావు, ఏఎస్ఓ పి.విజయ భాస్కర్, ఎంఎస్ఓ కేఎస్ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ప్రజల దరఖాస్తులపై సత్వరం స్పందించాలి

- కాలయాపన చేస్తే సహించేది లేదు
- ఎంపీ భరత్‌రామ్



గుడ్‌మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమంలో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులపై సత్వరమే స్పందించాలని, నెలల తరబడి పెండింగ్‌లో పెడితే సహించేది లేదని ఎంపీ భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నగరంలోని 46వ డివిజన్ క్వారీ మార్కెట్ సెంటర్ ఆనంద్ నగర్ సోమాలమ్మ ఆలయం నుంచి వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి మేడబోయిన సునీల్ ఆధ్వర్యంలో గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ మహిళ.. ఇంటి పన్ను కోసం దరఖాస్తు చేసుకుంటే 8 నెలలుగా ఇవ్వలేదని ఎంపీకి ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన భరత్ రామ్.. మున్సిపల్ ఆర్ఐ చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. టెక్నికల్ సమస్యతో కాలేదని సమాధానం చెప్పడంతో భరత్ రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రానికి పెండింగ్ దరఖాస్తులన్నీ పూర్తికావాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సమస్య ఉత్పన్నమైతే పైఅధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. వేలిముద్రలు పడక, మరే ఇతర కారణాలతో లబ్ధిదారులకు ఇవ్వని బియ్యం ఏమవుతున్నాయని అక్కడ రేషన్ అందిస్తున్న సిబ్బందిని ఎంపీ భరత్ ప్రశ్నించారు. దీనికి సరైన సమాధానం చెప్పలేకపోవడంతో జేసీ తేజ్ భరత్‌కు ఫోన్ చేసి రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తున్నట్టు అనుమానంగా ఉందని, దీనిపై దృష్టి సారించాలని సూచించారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, వాటిని సరిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, ఏపీ ఇండస్ట్రియల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, క్లస్టర్ ఇన్‌చార్జి బర్రే కొండబాబు, ఆర్ఎంసీ ఈఈ కనకారావు, ఏఈ చంద్రశేఖర్, ఎలక్ట్రికల్ ఏఈ రవి కుమార్, తిరగాటి దుర్గ పాల్గొన్నారు. కాగా.. స్థానిక చిన్న మసీదులో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎంపీ పాల్గొన్నారు.

శరవేగంగా అభివృద్ధి జరగాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి వార్డులోనూ అభివృద్ధి శరవేగంగా జరగాలని, ఎక్కడా సమస్యలు ఉండకూడదని వైఎస్సార్ సీపీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం 12, 49 వార్డుల ఇన్‌చార్జులు, కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయం, మున్సిపల్ సిబ్బందితో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్... ఆయా వార్డులలో చేపట్టిన అభివృద్ధి, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆయా వార్డు బాధ్యులను అడిగారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, జగనన్నే మా భవిష్యత్తు ప్రజాభిప్రాయ సేకరణను తెలుసుకున్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, కొయ్యన పెద్దిరాజు, బర్రే కొండబాబు, కన్వీనర్లు మేరపురెడ్డి రామకృష్ణ, గారా చంటిబాబు, కొల్లేపల్లి సుభాషిణి, ఉల్లూరి రాజు, ఆవాల సునీత, కూలి సూరిబాబు, కొయ్యన దీప్తి పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో మతసామరస్యం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న గిరజాల బాబు తదితరులు

కడియం: వైఎస్సార్ సీపీ రాష్ట్రకార్యదర్శి, బాధ్యత సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరజాల వీర్రాజు (బాబు) ఆధ్వర్యంలో స్థానిక మసీద్ ఏ కౌసర్‌లో ఇఫ్తార్ విందు నిర్వహించారు. 18 ఏళ్లుగా ప్రతిఏటా రంజాన్ మాసంలో బాబు ఈ ఇఫ్తార్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్‌విందు మత సామరస్యానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కడియం అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ పాల్గొన్నారు. అలాగే సంస్థ ద్వారా అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలవడం కూడా పలువురికి స్ఫూర్తినిస్తోందన్నారు. మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, దుళ్ల సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, పార్టీ నాయకులు సాకా పట్టాభి, ఆర్ఎస్ఎన్ మూర్తి, ఆరేటి వెంకట్రావు, దొడ్డా బుజ్జి, కొత్తూరి బాలనాగేశ్వరరావు, ముస్లిం నాయకులు షేక్‌సలీం, బాషా పాల్గొన్నారు. అంతకు ముందు ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

రైల్వే కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న రైల్వే కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ: నూతన పింఛన్ విధానం రద్దు చేసి, పాత విధానం అమలు చేయాలంటూ రైల్వే మజ్దూర్ యూనియన్ రాజమహేంద్రవరం డివిజన్ కార్యదర్శి విజయకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ పిలుపు మేరకు రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ కార్యాలయం ఎదుట పలు విభాగాలకు చెందిన కార్మికులతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ పాత పింఛన్ విధానం అమలయ్యేవరకూ పోరాటం సాగిస్తామన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వ కార్మికుల తో కలిసి వర్షాకాల సమావేశాలకు పార్లమెంట్ ముట్టడి, భారత్ బంద్ చేపట్టనున్నట్లు హెచ్చరించారు. నిరసనలో శ్రీనివాసరెడ్డి, వసంతరావు, బాబు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

సీతానగరం: రంజాన్ పండగను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి చేతుల మీదుగా 800 మంది ముస్లిం పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సీతానగరం, పెద వంగలపూడిల్లోని మసీదుల వద్ద డాక్టర్ బేగ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ శాంతి, సోదర భావం, ఐకమత్యం, దాతృత్వానికి ప్రతీక రంజాన్ మాసం అన్నారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ ఆరిఫ్ ఖాన్, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, ఇబాదుల్లా ఖురేషి పాల్గొన్నారు.